# ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన అందించాల్సిందిగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. నస్పూర్ మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి సౌకర్యాలను పరిశీలించారు. ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అవసరమైన విద్యా వసతులు కల్పిస్తోందని చెప్పారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధతో పోషకాహారం మెనూ అమలు చేస్తున్నట్లు వివరించారు. మెనూ ప్రకారం సకాలంలో ఆహారం, శుద్ధి చేసిన త్రాగునీరు అందించాలని అధికారులను ఆదేశించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధన చేయాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులు తయారు చేసిన అల్లికలు, కళాకృతులను పరిశీలించారు. 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలో ఉన్న సౌకర్యాలపై తెలుసుకున్నారు. వార్షిక పరీక్షలకు సన్నద్ధం కావాలని, ఏకాగ్రతతో చదివి మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధే లక్ష్యం

**మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు**



**షేనార్తజీ మీడియా, మంచిర్యాల :**

హాజీపూర్ మండలం చిన్నగోపాల్‌పూర్ పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ మద్దతుతో విజయం సాధించిన చిన్నగోపాల్‌పూర్ గ్రామ నూతన ఉప సర్పంచ్, వార్డు సభ్యులను మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు సన్మానించారు. ఉప సర్పంచ్‌గా ఎన్నికైన కోట్నాక పాండు, వార్డు సభ్యులు కొడప ప్రమోద్ కుమార్, జుగునక లింగు, గేడం ప్రవీణ్‌లను బుధవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని తన నివాసంలో శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామానికి అవసరమైన అభివృద్ధి పనులు ప్రాధాన్యంగా పూర్తి చేయాలని, ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. గ్రామ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

# నేరాల నియంత్రణకు కఠినంగా నాకాబందీ

**మంచిర్యాల జిల్లా పోలీసులు**



**శెనార్తి మీడియా, మంచిర్యాల**

జిల్లాలో నేరాల నియంత్రణ, నిషేధిత పదార్థాల రవాణా అరికట్టడం, అనుమానితుల కట్టడి కోసం నాకాబందీ కార్యక్రమాన్ని మరింత కఠినంగా కొనసాగిస్తామని మంచిర్యాల జిల్లా పోలీసులు తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాలు, మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్ పర్యవేక్షణలో జిల్లావ్యాప్తంగా ఒకేసారి వాహనాల తనిఖీలు నిర్వహించారు. అనుమానిత వాహనాలు, వ్యక్తులను ఆపి %=జ%, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, ఫిట్నెస్, పొల్యూషన్ సర్టిఫికెట్లను పరిశీలించారు. డ్రంక్ అండ్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా ప్రయాణం, పత్రాలు లేని వారిపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధించారు. ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, ప్రజలు పోలీసులకు సహకరించాలని జిల్లాపోలీసులు విజ్ఞప్తి చేశారు

# ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా పెరియార్ 52వ వర్ధంతి



**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

పెరియార్ ఇవి రామస్వామి 52వ వర్ధంతిని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంచిర్యాల పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద పెరియార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఈడబ్ల్యూఎస్ విధానానికి వ్యతిరేకంగా పోరాటం సాగించాలని, బహుజనులంతా రాజ్యాధికార సాధన కోసం ఐక్యంగా ముందుకు రావాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాట్లాడిన బీసీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కనుకుంట్ల మల్లయ్య, భారతదేశంలో విప్లవాత్మక సంస్కరణలకు బీజం వేసిన నాయకుడు పెరియార్ అని చెప్పారు. 1879లో తమిళనాడులోని ఈరోడ్‌లో జన్మించిన పెరియార్ కులాధిపత్యం, చాందస భావాలకు వ్యతిరేకంగా ఆత్మగౌరవ ఉద్యమాన్ని నడిపారని వివరించారు. ఆయన నాయకత్వంలో సాగిన ఆత్మగౌరవ ఉద్యమం తమిళనాడు ప్రజల సామాజిక, రాజకీయ, సాంస్కృతిక జీవితంలో గణనీయమైన మార్పులు తీసుకొచ్చిందని తెలిపారు. ద్రవిడ ఉద్యమానికి పెరియార్ ప్రేరణగా నిలిచారని, వెనుకబడిన వర్గాల్లో చైతన్యాన్ని రగిలించారని పేర్కొన్నారు. 1925లో ప్రారంభమైన ఆత్మగౌరవ ఉద్యమానికి ఈ ఏడాదితో వందేళ్లు పూర్తవుతున్నాయని చెప్పారు. ఈ ఉద్యమం వేల సంవత్సరాలుగా కొనసాగుతున్న కులవ్యవస్థ, సామాజిక అసమానతలపై సవాల్ విసిరిందని వివరించారు. మహిళలపై వివక్షతను అంతమొందించేందుకు పెరియార్ చేసిన కృషి చిరస్మరణీయమని తెలిపారు. పూజారులు లేకుండా ఆత్మగౌరవ వివాహాలు నిర్వహించడం, గుడ్డి ఆచారాలను వ్యతిరేకిస్తూ శాస్త్రీయ దృక్పథాన్ని ప్రోత్సహించడం ఆయన సంస్కరణవాద దృష్టికి నిదర్శనమని చెప్పారు. హేతుబద్ధ ఆలోచనలను వ్యాప్తి చేయడానికి వారపత్రికను ప్రచురించారని, కేరళలో వైకోమ్ సత్యాగ్రహంలో పాల్గొని అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడారని వివరించారు. వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు, విద్యావకాశాలకు పునాది పడటంలో పెరియార్ పాత్ర కీలకమని తెలిపారు. ఆత్మగౌరవ ఉద్యమ ప్రభావంతో లౌకికత, సమానత్వ భావాలు భారత రాజ్యాంగంలో స్థానం పొందాయని చెప్పారు. ప్రశ్నించే తత్వం, శాస్త్రీయ దృక్పథం వంటి అంశాలు ప్రాథమిక విధుల్లో చేర్చడంలో పెరియార్ ఆలోచనల ప్రభావం ఉందని పేర్కొన్నారు. పెరియార్ స్థాపించిన ద్రావిడ కజగం నుంచే తమిళనాడులో డీఎంకే, అన్నాడీఎంకే వంటి రాజకీయ పార్టీలు పుట్టాయని తెలిపారు. పెరియార్ ఆత్మగౌరవ పునాదులపై దేశవ్యాప్తంగా అట్టడుగు వర్గాల రాజకీయ, సామాజిక ఉద్యమాలు రూపుదిద్దుకున్నాయని చెప్పారు. మన రాష్ట్రంలో కూడా బహుజనుల ఐక్యతతో రాజ్యాధికార దిశగా అడుగులు వేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కనుకుంట్ల మల్లయ్య, భారత నాస్తిక సమాజం నాయకులు పురం శెట్టి శ్రీధర్, మాడిశెట్టి సత్యనారాయణ, మొగిలి లక్ష్మణ్, రమేష్, ఎడ్ల కిష్టయ్య, చెలిమల్ల అంజయ్య, దేవి పోచన్న, మంథని రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు దుప్పట్లు, నిత్యవసర సరుకులు పంపిణీ

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**



మంచిర్యాల పట్టణంలోని కార్మెల్ పాఠశాల విద్యార్థులు మంగళవారం హాజీపూర్ మండలం ర్యాలీ గడ్పూర్ గ్రామపంచాయతీ పరిధిలోని బాబర్ నగర్ ప్రాంతంలోని సుమారు 40 మంది నిరుపేద కుటుంబాలకు దుప్పట్లు, నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. విద్యార్థులు తాము సేకరించిన నిధులతో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ సారూప్య, ఉప ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ సీమ, సిస్టర్ సోఫీ, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో బాబా నగర్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సిస్టర్ మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే నిజమైన మానవత్వం అని, తోటి వారు కష్టాల్లో ఉంటే ఆదుకోవడానికి మనము ఉన్నామనే భరోసా కల్పించడం, విద్యార్థుల్లో చిన్నతనం నుండే పేదవారికి సహాయం చేయడం, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం నేర్పించాలన్నారు. అదే విధంగా గ్రామ ఉపసర్పంచ్ బేర వెంకటేష్ మాట్లాడుతూ... పేదలకు నిత్యవసర సరుకులు, దుప్పట్లు పంపిణీ చేయడానికి మా గ్రామాన్ని ఎన్నుకోవడం చాలా సంతోషమన్నారు. నిరుపేదలను గుర్తించి వారికి సహాయం చేయాలనే సంకల్పం చాలా గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మునిగంటి స్వప్న, ఉప సర్పంచ్ బేర వెంకటేష్, మాజీ ఎంపిటిసి జాలే రాజలింగు, వార్డ్ మెంబర్ జలా భవాని, గ్రామ అధ్యక్షుడు జీల మల్లేష్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సాధారణ ప్రసవాలపై దృష్టి పెట్టాలి

- **శస్త్రచికిత్సలు తగ్గించాలి : రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ సంచాలకుడు డాక్టర్ రవీందర్ నాయక్**

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

సాధారణ ప్రసవాలను ప్రోత్సహించి, సిజేరియన్ శస్త్రచికిత్సలను తగ్గించే దిశగా కృషి చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ సంచాలకుడు డాక్టర్ రవీందర్ నాయక్ తెలిపారు. బుధవారం మంచిర్యాలలోని మాతా%-%శిశు సంరక్షణ కేంద్రం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి వైద్యసేవలను సమీక్షించారు. గర్భిణుల 100 శాతం నమోదు చేయాలని, అవసరమైన అన్ని వైద్య పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. 102 అంబులెన్స్ సహకారంతో స్కానింగ్ కేంద్రాలకు తరలించి, స్కానింగ్ ద్వారా అందిన ఈ డి డి వివరాలను ఎన్సిపి కార్డులో నమోదు చేయాలని సూచించారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి వైద్యుల పర్యవేక్షణలో ఉంచాలని చెప్పారు. హెల్ప్‌డెస్క్ ద్వారా గర్భిణుల వివరాలు సేకరించి, ఫోన్ ద్వారా ఫాలోఅప్ చేయాలని ఆదేశించారు. ఏ ఆసుపత్రిలో ప్రసవానికి వస్తారో ముందస్తుగా వివరాలు సేకరించి తగిన సదుపాయాలు కల్పించాలని తెలిపారు. మహిళా ఆరోగ్యం మెరుగ్గా ఉంటే కుటుంబం, సమాజం, జిల్లా ఆరోగ్యంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. నవజాత శిశు సంరక్షణ కేంద్రంలో అత్యవసర వైద్యసదుపాయాలు అందుబాటులో ఉండాలని, చిన్నారుల వైద్యులను సిద్ధంగా ఉంచాలని సూచించారు. జిల్లా స్థాయిలో న్యూ బోర్న్ కేర్ సేవలను పరిశీలించారు. మలేరియా, డెంగ్యూ, చికున్ గున్య వంటి కీటకజన్య వ్యాధులు ప్రబలకుండా ప్రతి వారంలో రెండుసార్లు డ్రైడే పాటించాలని ఆదేశించారు. చలి తీవ్రత దృష్ట్యా వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణులు జాగ్రత్తలు తీసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. బీపీ, డయాబెటిస్, క్యాన్సర్ వంటి అసంక్రమణ వ్యాధులను ముందుగానే గుర్తించి చికిత్సలు అందించాలన్నారు.కుష్టు వ్యాధి నివారణ, క్షయ నిర్మూలన కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. జిల్లా వైద్యసేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# మ్యాథ్స్ నిత్యజీవితంలో భాగం చేసుకోవాలి

- **సరస్వతి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ ఉప్పుల శ్రీనివాస్**

**రామడుగు :**

విద్యార్థులు మ్యాథ్స్ సబ్జెక్టును నిత్యజీవితంలో భాగం చేసుకోవాలని సంస్వతి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ ఉప్పుల శ్రీనివాస్ అన్నారు. జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా రామడుగు మండలం వెలిచాల సరస్వతి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ లో బుధవారం మ్యాథ్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా 221 మంది విద్యార్థులు తమ ప్రాజెక్టులను ప్రదర్శించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మ్యాథ్స్ పై మక్కువ పెంచుకోవాలని, నిత్యం సాధన చేస్తే సులవవుతుందని పేర్కొన్నారు. మ్యాథ్స్ టీచర్స్ గీత, లక్ష్మి, శిరీష, సునంద, శ్రీనివాస్కు గిఫ్ట్ అందజేసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో స్కూల్ కో కరస్పాండెంట్ ఉప్పుల సత్యం, టీచర్స్ పాల్గొన్నారు.





# ఎమ్మెల్యే సహకారంతో మధురానగర్ ను అభివృద్ధి చేస్తా..

**సర్పంచ్ వేముల భాస్కర్**

**శెనార్తిమీడియా, కరీంనగర్ :**

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సహకారంతో మధురానగర్ గ్రామాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని సర్పంచ్ వేముల భాస్కర్ అన్నారు. మధురానగర్ గ్రామంలోని 9వ వార్డులో డ్రైనేజీ నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం చేసిన మూడు రోజుల్లోనే అభివృద్ధి పనులను ప్రారంభించడంపై గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో వార్డుమెంబర్లు, ప్రజలు పాల్గొన్నారు.

